"మహబూబ్‌కి తెలుసా?"

"ఇంతవరకూ తెలీదు. ఇవ్వాళ్ళ కవల్ చెవితే చెప్పి వుంటాడు."

"కేవలం చెప్పటమేనన్న మాట. అనుమతి అంటూ అఖ్ఖర్లేదన్నమాట."

బిల్కీస్ జవాబు చెప్పలేదు.

కొద్దిక్షణాలు మౌనంగా కూచున్నాడు మిర్జా. ఆతర్వాత మెల్లిగా అన్నాడు, "చూడుబేటీ ! నీఅన్నయ్య లిద్దరూ మమ్మల్ని వదిలి దూరదేశాలకు వెళ్ళిపోయారు. ఇకమిగిలింది నువ్వొక్కర్తివే. నీమీదే పంచ ప్రాణాలు పెట్టుకు బ్రతుకుతున్నాం. చిన్నప్పటినించీ నీకోరికలు, చిన్నవీ పెద్దవీ అన్నీ తీరుస్తూవచ్చాం. ఇకమీదట కూడా తీర్చాలనేవుంది. కాని . కాని నువ్వు ఒక ముస్లింకాని వాణ్ణి పెళ్ళి చేసుకుంటానంటే మేమువొప్పుకుంటా మనుకోవటం పెద్దపొరపాటు. అది కలలోకూడా జరగని విషయం"

బిల్కీస్ కొంచెంసేపు మాట్లాడకుండా కూచుంది. ఆ తర్వాత మెల్లిగా జవాబు చెప్పింది. "డాడీ ! నేను మీ కూతుర్ని. మీపట్టుదల నాకు తెలుసు. అందులో కొంత నాలోనూవుంది. నా నిర్ణయం కూడా వినండి .. నేను పెళ్ళి గనక చేసుకుంటే కవల్‌రాయ్ సక్సేనానే చేసుకుంటాను. లేకుంటే ఇలాగే వుండిపోతాను. ఎలాగూ డాక్టర్నవుతున్నాను. ఆ వృత్తితోనే తృప్తి పడతాను," అంటూ లేచి చక్కా వెళ్ళిపోయింది.

అటేపే చూస్తూ వుండిపోయారు భార్యా భర్తలు. మిర్జా మెల్లగా హుక్కాగొట్టాన్ని అందుకుని దీర్ఘాలోచనల్లో మునిగిపోయాడు. నుస్రత్ మొహానికి చీరచెంగు అడ్డంపెట్టుకుని వెక్కి వెక్కి పడటం మొదలెట్టింది.

చాలాసేపటికి, మిర్జా తేరుకొని, "బిల్లూ!... బిల్లూబేటీ !" అంటూ అతి మృదువుగా పిలిచాడు.

